ఆదమరిస్తే అంతే!



చెరుకువాడ శివారులో జాతీయ రహదారి కాలువలోకి కుంగిపోవడంతో ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ ఏర్పాటు చేసిన డ్రమ్ము



చెరుకువాడలో కాలువలోకి కుంగిపోతున్న జాతీయ రహదారి

- ఘోర ప్రమాదం అంచున ప్రయాణికులు, వాహనదారులు
- చెరుకువాడ నుంచి ఆకివీడు మండలం అజ్జమూరు వరకు ప్రమాదకరం
- కాలువలోకి జారిపోతున్న జాతీయ రహదారి
- జాతీయ రహదారిని నిండాముంచిన ఉండి పంట కాలువ పనులు
- అధికారులు స్పందించకపోతే ఘోరప్రమాదాలు జరిగే అవకాశం

ఉండి: జాతీయ రహదారికి ప్రమాదం వాటిల్లింది. ఉండి మండలం చెరుకువాడ, కలిసిపూడి గ్రామాల సరిహద్దు నుంచి ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామం వరకు జాతీయ రహదారి 165 ఉండి పంటకాలువలోకి దిగజారిపోతుంది. గత వేసవి సమయంలో ఉండి పంటకాలువకు ప్రొక్లెయిన్‌ల సహాయంతో తూతూ మంత్రంగా నిర్వహించిన పూడికతీత పనులు ఇప్పుడు జాతీయ రహదారి దిగజారిపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. కాలువలో బాగా పనిచేసి పూడిక తీసినట్లు చెప్పుకునేందుకు కాంట్రాక్టర్ ప్రొక్లెయినర్‌ల సహాయంతో కాలువగట్ల ఓరన పెద్దపెద్ద గోతులు పెట్టి మట్టిని తీసి గట్లపై వేయడంతో వాటివల్లనే ఇప్పుడు జాతీయ రహదారికి ప్రమాదం వాటిల్లింది. సుమారు రెండు కి.మీ మేర జాతీయ రహదారి కుంగిపోతుండగా దానిలో ఒక కి.మీ. మేర ఈ ప్రమాదం అధికంగా ఉంది. చెరుకువాడ గ్రామంలో బస్టాండ్ వద్ద నుంచి మొదలు కొని అజ్జమూరు శివారు(కాలువకు కూడా ఇదే శివారు)వరకు వేగంగా కాలువలోకి రోడ్డు జారిపోతుండటంతో ఇప్పటికే వాహనాలు ఒకవైపుగానే నడుస్తున్నాయి. దీనివల్ల రోడ్డు మొత్తం పగుళ్లు ఏర్పడి రోడ్డు మరింతగా కాలువవైపుగా జారిపోతుంది.

ఉదయమే ప్రమాదమైతే రాత్రి సమయంలో?

జాతీయ రహదారి ఉండి కాలువలోకి జారిపోవడంతో పగటి సమయంలోనే వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగటి సమయంలోనే రోడ్డంతా ఒకేలా కనిపించడం, జారిపోయిన ప్రాంతాన్ని గుర్తించలేకపోవడంతో పలు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. పగటి సమయంలోనే ఇలా జరుగుతుంటే రాత్రి వేళల్లో ఇంకే విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. జాతీయ రహదారి కావడంతో పాటు ఏలూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలకు నిత్యం వందలాది ప్యాసింజర్ వాహనాలు, బస్సులు, లారీలు వంటి హెవీ వెహికల్స్ వెళ్తుతుండటంతో పెను ప్రమాదం పొంచి ఉందని స్థానికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ మధ్య కాలంలో హైదరాబాద్, విశాఖపట్నం, బెంగుళూర్ ప్రాంతాలకు కొత్తగా వచ్చిన స్లీపర్ హైటెక్ బస్సులకు ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా వాహనదారులు పేర్కొంటున్నారు. అలాగే నిత్యం నడిచే స్కూల్ బస్సులు, ఆటోలు అదుపుతప్పుతాయేమో అని భయభ్రాంతులకు గురవుతున్నారు. బస్సుకాస్త అదుపుతప్పితే కాలువలోకి దూసుకుపోతుందని దీనివల్ల ఎంతో ప్రాణనష్టం జరుగుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రివిట్‌మెంట్ వాల్ నిర్మించాల్సిందే.

ఉండి పంట కాలువలోకి జాతీయ రహదారి దిగజారిపోతుండటంతో అధికారులు వెంటనే స్పందించి రివిట్‌మెంట్ వాల్ నిర్మాణం చేయకపోతే ఘోరప్రమాదాలు చవిచూడాల్సి ఉంటుంది. నిత్యం వందలు, వేల సంఖ్యలో ఈ రహదారిలో వాహనాలు నడుస్తూంటాయి. ఎవ్వరు అదుపుతప్పినా పెనుప్రమాదాలు చోటు చేసుకుంటాయని వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ముందుగా దిజగారిపోతున్న రహదారిని పరిశీలించి అధికారులు వెంటనే రిపేరువర్క్కులైనా చేపడితే కొంత వరకు ప్రమాదాన్ని నివారించే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

అధికారులు అప్రమత్తం కావాలి



కుంగిపోతున్న జాతీయ రహదారిని సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలి.లేకుంటే పెద్ద పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ఉదయం సాయంత్ర వేళల్లో పదుల సంఖ్యలో సూల్ బస్సులు, ఆటోలు తిరుగుతూ ఉంటాయి. ఒక్కటి అదుపు తప్పినా ప్రమాదం ఏస్థాయిలో ఉంటుందో అర్థం చేసుకుని వెంటనే అధికారులు రంగంలోకి దిగాలి.

–బాతు జాన్సన్,కలిసిపూడి

వాహనదారులను అప్రమత్తం చేయాలి



ఇంత పెద్ద ప్రమాదం కళ్ల ముందున్నా అధికారులు కనీసం ఈవైపు చూడలేదని అర్థం అవుతుంది. కనీసం ఇప్పుడైనా వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాహనదారులను అప్రమత్తం చేసేలా వెంటనే చర్యలు చేపట్టాలి. అలాగే రిపేరు వర్క్కులు కూడా వెంటనే జరగాలి. ప్రతి రోజు రాత్రి వేళల్లో వెళ్లే హైటెక్ వంటి బస్సులు, పగటి సమయంలో వెళ్లే ఆర్టీసి బస్సులు అదుపు తప్పితే జరిగే ఘోరాన్ని ముందుగానే ఊహించాలి.

–బొడ్డు నాగన్న,చెరుకువాడ

క్లుప్తంగా

కాళ్లకూరు వెంకన్న సేవలో జిల్లా కలెక్టర్



కాళ్లకూరు వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

కాళ్ల: కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో వెంకటేశ్వర స్వామిని జిల్లా కలెక్టర్ నాగరాణి మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణిని ఘనంగా సత్కరించారు.

సురక్షిత తాగునీరు అందించేందుకు కృషి



ఫిల్టర్ బెడ్‌లోనికి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

కాళ్ల: గ్రామంలోని శివారు ప్రాంత ప్రజలకు సైతం స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామని కోపల్లె గ్రామ ఉపసర్పంచ్ బూడి వెంకటేశ్వరరావులు తెలిపారు. కోపల్లె రక్షితమంచినీటి సరఫరా కేంద్రం వద్ద మంగళవారం రూ.6లక్షల నిధులతో శుభ్రపరచిన ఫిల్టర్ బెడ్‌ను మంగళవారం అధికారులతో కలిసి ప్రారంభించారు. త్వరలోనే డిప్యూటీ స్పీకర్ సహకారంతో గ్రామంలో మైక్రో ఫిల్టర్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు అవగాహన



స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందని ఎంపీడీఓ బాబూరావు చెప్పారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపు వల్ల వచ్చే లాభాల్ని మంగళవారం వివరించారు. జీఎస్టీ 2.0 అమలు సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వించినట్లు హెచ్.ఎం. పారనాయుడు చెప్పారు. విజేతకలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఏ.రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజుకు అభినందనలు



శ్రీనివాసరాజును అభినందిస్తున్న దృశ్యం

కాళ్ల: వైఎస్సార్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ ఇ సి) మెంబర్ గా నియమించిన మాజీ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజును పలువురు అభినందించారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా అందించిన సేవలకు గుర్తించి కీలక పదవి ఇవ్వడం పై నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు అభిమానులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా వైఎస్సార్ సీపీ జిల్లా ట్రెజరర్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు పాతపాటి శ్రీనివాసరాజును మంగళవారం ఆయన గృహం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

తలసేమియా పిల్లలకు ఉచితంగా సేవలు అందిస్తున్నాం



మాట్లాడుతున్న చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఏఎస్ఎన్ రాజు

భీమవరం (ప్రకాశం చౌక్): తల సేమియా బాధితుల జీవన ప్రమాణం పెంపొందించేందుకు ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా సెంటర్‌ను ప్రభుత్వ, బ్లడ్ బ్యాంక్ నిబంధన ప్రకారమే ఏర్పాటుచేసి అనేకమంది తలసేమియా పిల్లలకు ఉచితంగా సేవలు అందిస్తున్నామని ఏఎస్ఎన్ రాజు బ్లడ్ బ్యాంక్ అధినేత ఏఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ రోడ్‌లోని తలసేమియా కేర్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవే లక్ష్యంగా తలసేమియా బాధితులకు దాతల సహకారంతో అన్ని రకాల నిబంధనలు జాగ్రత్తలు తీసుకుని రక్త దానం ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తున్నామన్నారు. అయితే రక్త సేకరణకు ఎటువంటి అనుమతులు లేని హోప్ సంస్థ ప్రతినిధులు మాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద తలసేమియ పిల్లల వారి తల్లిదండ్రులను తీసుకువెళ్లి మాపై ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. అనుమతులు లేకుండా రక్త సేకరణ చేసే వారిపై అధికారులు కచ్చితంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయిలో గొల్లవానితిప్ప విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులు అభినందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు గొల్లవానితిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ రాంబాబు మంగళవారం తెలిపారు. సోమవారం ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో అండర్-14, అండర్-17 విభాగాలలో ఎంపికలు జరగగా జిల్లా తరఫున గొల్లవానితిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని హ్యాండ్ బాల్ క్రీడాకారులు జి. రామ్ సాయి, పీఆర్‌సీఎస్ విఘ్నేష్ ఎంపికయ్యారన్నారు. వీరిని ప్రధానోపాధ్యాయులు పి. మల్లిఖార్జునరావు, ఎస్ఎంసీ చైర్మన్ ఎం. నాగేంద్ర, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

వంతెన నిర్మాణానికి భూమి పూజ



దొడ్డనపూడి గ్రామంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సుబ్బారావు

కాళ్ల: గ్రామంలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని దొడ్డనపూడి గ్రామ సర్పంచ్ కొల్లి సుబ్బారావు తెలిపారు. దొడ్డనపూడి గ్రామంలో కాసులమ్మ పేటకు వెళ్లే దారిలో పంట బోదెపై సుమారు రూ.9 లక్షలతో నిర్మించబోయే వంతెనకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా వంతెన లేక ఇబ్బందులు పడుతున్న వాసులకు కష్టాలు తీరుతాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమ్మెను విరమింపజేయాలి



సమ్మెను విరమింపజేయాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్న దృశ్యం.



పాలకోడేరులో నిరసన తెలియజేస్తున్న ఆశా వర్కర్లు

ఆకివీడు: పీహెచ్‌సీ వైద్యులు చేస్తున్న న్యాయబద్ధమైన సమ్మెను ప్రభుత్వం చర్యలతో పరిష్కరించి, విరమింపజేయలని ఆశా వర్కర్ల సంఘం జిల్లా కోశాధికారి లారెన్స్ కుమారి డిమాండ్ చేశారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద మంగళవారం సమ్మెకు సంఘీభావం తెలుపుతూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ పేదవారికి, మధ్యతరగతికి, పల్లెల్లో వైద్యం అందజేసే పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్‌లను ప్రభుత్వం పరిశీలించాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వైద్య రంగం ఉండాలని, దీనివల్ల పేదలకు వైద్యం అందుతుందన్నారు. కార్పొరేట్ వైద్యంతో ప్రజలు ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా కృంగిపోతున్నారని వాపోయారు. పీపీపీ పేరుతో వైద్యాన్ని, వైద్య కళాశాల్ని ప్రైవేటు పరం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పెంకి అప్పారావు, ఇంటి మార్తమ్మ, రాణి, చిన్నయ్యమ్మ, అశ్వని, కనక మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

పాలకోడేరు: ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆశా వర్కర్లు యూనియన్ జిల్లా కన్వీనర్ ఎస్. లారెన్స్ కుమారి విమర్శించారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశా డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం లారెన్స్ కుమారి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను మార్పు చేయాలన్నారు. ఆశ వర్కర్లతో సమానంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు అన్ని సౌకర్యాలు వేతనాలు అందించాలన్నారు. అలాగే అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చులు నిమిత్తం రూ. 20 వేలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేరీ జాస్మిన్, శ్వేత, తరంగిణి, నీలిమ, మణి శ్రీ, సురేఖ పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ భీమారావు

భీమవరం: రామాయణం రచించిన వాల్మీకి జయంతిని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం వాల్మీకి చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ వి. భీమారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్ల నుంచి మంచిగా మారేందుకు వాల్మీకి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ శ్రీ డి. విశ్వనాథ్, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.వీ.వీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ కె.వి.వి.ఎస్ సత్యనారాయణ మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అహ్మదున్నీషా , మహిళా ఆర్మ్డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) ఇందుమతి, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె.వెంకట్రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు బాగా చదువుకోవాలి



ఉత్తీర్ణులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): మహిళలు చదువుకుంటనే అన్ని రంగాల్లో రాణించగలరని జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. మంగళవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో గత సంవత్సరం నిర్వహించిన ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం నందు ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అక్షరాంధ్ర ఉల్లాస్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యనోడల్ అధికారి కె వీ.వీ. సత్యనారాయణ డీఆర్‌డీఏ పీడీ ఎం.ఎస్.వేణుగోపాల్, డీపీఎంలు, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉండి: ఈ నెల 6వ తేదీన ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ జిల్లా జట్లకు ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటలో మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్ 14 విభాగంలో డీ మనో(9వ తరగతి) అండర్ 17 విభాగంలో పీ చంద్రశేఖర్‌నాయుడు(9వ తరగతి), పీ సురేఖ(పదో తరగతి) హ్యాండ్‌బాల్ జట్లకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు పేరుతెచ్చేలా జిల్లా జట్లకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం మంచి పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీఈటీ కే శ్రీనివాసరావును అభినందించారు.

ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలి



జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 200 రోజులు పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన పాలకోడేరులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 10వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను సీహెచ్ సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రూ. 600 వేతనం ఇవ్వడంతో పాటు సమ్మర్ అలవెన్స్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి కూలీలు సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యాప్తంగా అనేక ఉద్యమాలు చేసి కూలీలకు సంఘం అండగా నిలబడింది అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శేషాపు అత్రియ మాట్లాడుతూ 132 పని ప్రదేశాలను సందర్శించడం జరిగిందని ఈ సందర్భంగా అనేక సమస్యలను ఉపాధి కూలీలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. సమస్యలు పరిష్కారానికి మూడేళ్ల కాలంలో అనేక పోరాటాలు చేసి ఫలితాలు సాధించమని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ నాయకులు కలిదిండి గోపాల రాజు, మధ్యాహ్నం భోజనం పథకం నాయకులు దున్నా మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం హాజరు ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పోడూరు ఎంఈఓ-2 జీవీ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పోడూరు మండలం చింతలగరువు ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు.

రాష్ట్రస్థాయిలో మోగల్లు విద్యార్థుల ప్రతిభ

పాలకోడేరు: మండలంలో మోగల్లు ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.లిల్లీ భాను, ఎస్. ధరణి నాగ ప్రకాష్, జి.వినయ భాస్కర్, ఎం. నాగేంద్రబాబు అనే విద్యార్థులు అండర్ -14, అండర్ -17 కేటగిరీలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో ఏలూరు ఇండోర్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని కోచ్ వనుం వెంకటేష్ తెలిపారు. గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

విద్యార్థులపై వార్డెన్ దూషణలు

ఆకివీడు: ఓ వార్డెన్ హాస్టల్‌లోని విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, బూతులు తిడుతూ విధులు నిర్వహిస్తున్న వైనం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. స్థానిక హరిజనపేటలోని ఎస్‌సీ బాలుర హాస్టల్ వార్డెన్ వికృత చేష్టలకు విద్యార్థులు విస్తుపోతున్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు టీమ్ రక్షక్ దళ్‌కు ఫిర్యాదు చేయడంతో వారు పిల్లలు పడుతున్న అవస్థల్ని, వార్డెన్ అసభ్యకర పదజాలాలతో మాట్లాడుతున్న విషయాల్ని చిత్రీకరించడంతో సోషల్ మీడియాలో హల్ చల్‌చేస్తోంది. ఈ విషయాన్ని ఏఎస్‌డబ్ల్యూజే రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తన దృష్టికి రాలేదని, విచారణ చేస్తానని మంగళవారం చెప్పారు.

జడ్జిపై దాడికి డీఎన్నార్ కళాశాల వద్ద నిరసన



డీఎన్నార్ కళాశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న దృశ్యం

భీమవరం: సుప్రీం కోర్టు జడ్జి గవాయ్‌పై జరిగిన దాడి సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని న్యాయ వ్యవస్థ చరిత్రలో ఇది తీరని మచ్చగా మిగిలిపోతుందని భీమవరం డీఎన్నార్ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ వై అశోక్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం కళాశాల ప్రాంగంలోని న్యాయ దేవత విగ్రహం వద్ద ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఎఎల్) ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జడ్జిపై దాడికి పాల్పడిన న్యాయవాది, మద్దతుగా వెళ్లిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, అధ్యాపకులు భాస్కరరావు, ఎం చిత్రభాను, కిరణ్, స్వాతి, వీర్రాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.